నందిగామలో అభివృద్ధి పరుగులు

నందిగామ: నందిగామ పట్టణం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. రోజురోజుకు పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా మౌలికవసతులు కల్పిస్తుండటంతో పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. గత నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధిపనులు చేపట్టారు. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా నందిగామ అభివృద్ధికి చిరునామాగా మారింది.

రూ.36కోట్లతో అభివృద్ధి పనులు..

నందిగామ పట్టణ 28.70 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించింది. జనాభా 55,449మంది ఉన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అంచనాలు రూపొందిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పట్టణాభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధాన రహదారులతోపాటు ఆయా కాలనీల్లో కలిపి 175రోడ్లు ఉండగా వాటిలో 135 రోడ్లను సీసీ, బీటీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. ఇందుకోసం రూ.8.23కోట్లు ఖర్చు చేశారు. రూ.9.41కోట్లతో 47 ప్రధాన డ్రెయిన్లతోపాటు చిన్న డ్రెయిన్లను అభివృద్ధి చేశారు. అదేవిధంగా రూ.1.78కోట్లతో సీఎం రోడ్డు అభివృద్ధి, సీఎస్ఆర్ నిధులు రూ.6.3కోట్లతో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేశారు. రూ.2కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లు, రిజర్వాయర్ ఏర్పాటు, పైపులైన్ నిర్మాణానికి రూ.2కోట్లు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, రూ.28లక్షలతో వైఎస్సార్ ఫ్రూట్ మార్కెట్, రూ.12లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మాణం పూర్తిచేశారు. ముఖ్యంగా ఆరోవార్డులో రూ.60లక్షలతో ప్రధాన డ్రైనేజీ పనులు చేపట్టడంతోపాటు డ్రైనేజీపై 220 మీటర్ల మేర వాక్ వే ఏర్పాటు చేశారు. గతంలో ఎంతో ఇరుకుగా ఉండే సీఎం రోడ్డును కూడా విశాలంగా విస్తరించిన ఘనత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకే దక్కిందని చెప్పవచ్చు. అదేవిధంగా రూ.22లక్షలతో బాబూ జగ్జీవన్‌రాం భవన్‌కు ఆధునికీకరణ పనులు చేపట్టారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.4.52కోట్లతో నందిగామ పట్టణంలోని పాఠశాలలను అభివృద్ధి చేశారు. నందిగామ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకావడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం కూడా వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నందిగామలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.44 కోట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలోనే ఈ పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నారు.

ఇలా నందిగామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ విశేషంగా కృషి చేస్తున్నారు. సీఎం జగనన్న పాలనలో నందిగామ పట్టణ రూపురేఖలే మారిపోయాయని పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అభివృద్ధి చేసిన నందిగామలోని సీఎం రోడ్డు




ప్రధాన డ్రైయిన్‌పై అందంగా ఏర్పాటు చేసిన వాక్ వే


విస్తరణ పనులు సాగుతున్న నందిగామ–చందర్లపాడు రోడ్డు

అభివృద్ధి కనిపిస్తోంది..



నందిగామ పట్టణంలో ఇటీవల జరిగిన అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ముఖ్యంగా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆరోవార్డులోని ప్రధాన డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. నందిగామలోని అనేక ప్రధాన రహదారులు అభివృద్ధి చెందాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది.

కెజెడ్ఎస్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగి,

సీఎం రోడ్డు ఇప్పుడు బాగుంది.



నందిగామ పట్టణంలోని సీఎం రోడ్డులో40 ఏళ్లుగా ఉంటున్నాం..ఈ రోడ్డులో గతంలో చాలా ఇరుకుగా ఉండేది. ప్రస్తుతం మా రోడ్డును బాగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు ట్రాఫిక్ సమస్య కూడా లేదు. విశాలమైన రహదారి ఏర్పాటు చేయడంతో ఎంతో బాగుంది.

షేక్ జాను, సీఎం రోడ్డు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంతోపాటు బలుసుపాడు, అనుమంచిపల్లి ఫీడర్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట అర్బన్: చిల్లకల్లు 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా జగ్గయ్యపేట పట్టణంతోపాటు మండలంలోని కె.అగ్రహారం, ముక్త్యాల, త్రిపురవరం గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ఎస్. కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి రూ.41వేల విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు రూ. 41,856లను విరాళంగా అందించారని ఆలయ చైర్మన్ రవీంద్ర భరద్వాజ్ ఆదివారం తెలిపారు. 12 మంది భక్తులు విరాళాలు అందించినట్లు ఆయన వివరించారు. దాతలకు స్వామి వారి ప్రసాదాలు, చిత్ర పటాలు అందజేసి సత్కరించారు.

5న హుండీ కానుకల లెక్కింపు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలను ఫిబ్రవరి ఐదోతేదీ ఉదయం పదిగంటలకు లెక్కించనున్నట్లు ఈవో జయప్రకాష్‌బాబు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు మహాశివరాత్రి సందర్భంగా కొబ్బరి చిప్పల సేకరణ, లడ్డుప్రసాదాల హక్కులకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు పాల్గొనాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో పి.సాయిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డివిజన్‌పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీటీ షేక్ నాగుల్‌మీరా తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీటీ కోరారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు వినాయక్‌నగర్‌లో భార్యభర్తలు పిల్లా హారిక, పిల్లా రాజేష్ నివశిస్తున్నారు. వీరికి 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా భార్యభర్తలకు తరచుగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం భర్త టిఫిన్ తీసుకు రావటానికి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి భార్య ఇంట్లో లేదు. ఆమె ఫోన్ స్విచ్చాఫ్ అయింది. వెతికినా ఆమె ఆచూకీ తెలియక పోవటంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేయడంతోపాటు దాడి చేసి గాయపరిచిన భర్తపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్ రావు నగర్ 5వ లైన్‌కు చెందిన పోలవరపు మేరీ, నాగదుర్గారావులు ఏడేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ముఠా పని చేసే నాగదుర్గారావు గత కొంత కాలంగా మద్యానికి బానిసై భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం తెల్లవారుజామున భార్య వద్దకు వెళ్లిన నాగదుర్గారావు గొడవ పెట్టుకోవడమే కాకుండా కర్రతో కొట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చర్మ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పటమట(విజయవాడతూర్పు): చర్మ వ్యాధులపై అప్రమత్తత అవసరమని ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ రాశినేని నీలకంఠ అన్నారు. పటమటలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమభావన మిత్ర మండలి విజయవాడ శాఖ 96వ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శరీరంలో చర్మం ప్రధాన భాగమని, శిరస్సు మీద ఊడిపోయిన వెంట్రుకలకు బదులుగా మళ్లీ వెంట్రుకలను శాశ్వతంగా ఏర్పరవచ్చని చెప్పారు. ఈ ప్రాసెస్‌లో ఎవరి జుట్టును వారికి మాత్రమే అమర్చాలని, అలా అమర్చిన జుట్టు క్రమంగా పెరుగుతుందన్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు సాధారణంగా తామర, గజ్జి వస్తాయని చెప్పారు. ఇలా రావటానికి శరీరం పొడిగా లేకుండా ఉండడమే కారణమని, ఎల్లప్పుడూ పొడి వస్త్రాలు మాత్రమే ధరించాలని సూచించారు. అనంతరం మండలి సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు కోనేరు నరేంద్ర, ప్రతినిధులు యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఆచార్య, పీఆర్కే ప్రసాద్, డాక్టర్ ఎంపీ రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా, భానుశ్రీ మ్యూజిక్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు సయ్యద్‌అలీ, భానుశ్రీ ఆధ్వర్యంలో పావని, సత్యనారాయణ, విజయ్, వంశీ, వీరశేఖర్ రాంబాబు తదితరులు భక్తి గీతాలతో పాటు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. అనంతరం కళాకారులకు ప్రతిభా పురస్కారాలను అందించారు.

స్వరఝురి సేవా సంస్థ ఆధ్వర్యంలో..

స్వరఝురి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొత్తా పూర్ణానందం హాల్‌లో అలనాటి మధుర గాన లహరి కార్యక్రమం నిర్వహించారు. తాళ్లూరి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆలపాటి అశోక్‌కుమార్, మిటలరీ కోటేశ్వరరావు, సాంబశివరావు, పీ రంగనాథం, అంజుస్వామి తదితరులు సినీ గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, సీనియర్ గాయకుడు దేవిడ్‌రాజు గాయనీ గాయకులను అభినందిస్తూ ప్రసంగించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను, పక్కన ఎంపీపీ, జెడ్పీటీసీ

ఇందుగపల్లి(వత్సవాయి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఇందుగపల్లిలో రూ.43లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ఒకేసారి 1.50లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థతో గతంలో మాదిరిగా మండల కేంద్రాలకు పరుగులు తీయకుండా నేరుగా సంక్షేమ పథకాలు గ్రామంలో అందుతున్నాయని గుర్తుచేశారు. బడుగు, బలహీనవర్గాలకే కాకుండా అర్హత ఉంటే ఈ ప్రభుత్వంలో అగ్రవర్ణాల పేదలకు కూడా సంక్షేమ పథకాలు అందుతున్న వైనాన్ని అందరూ గుర్తించాలని కోరారు. గతంలో జన్మభూమి కమిటీలతోపాటు గ్రామనాయకులు చెప్పిన వాళ్లకే సంక్షేమ పథకాలు అందేవని, కానీ నేడు ఆ పరిస్థితులు లేవని అర్హత ఉంటే నేరుగా సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తులు చేసుకుంటే వలంటీర్ల ద్వారా ఆయా పథకాలు నేరుగా ఇంటిముంగిటనే లబ్ధిదారులకు అందుతున్న వైనం రాజకీయ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయమని అభివర్ణించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరూ అండగా ఉండాలని కోరారు. గ్రామపార్టీ అధ్యక్షులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ సభ్యులు యేశపోగు దేవమణి, సొసైటీ అధ్యక్షులు వాసిరెడ్డి కృష్ణారావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మాదాల వీరయ్యచౌదరి, నాయకులు పాపినేని రాంబాబు, చావా కృష్ణారావు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు తనను, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కోరారు. ఇందుగపల్లిలో ఆదివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా పథకాల లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును అడిగితెలుసుకున్నారు. విప్ ఉదయభాను మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరధ్వాజ్, సచివాలయ లేళ్ల నాగేంద్రరెడ్డి, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు వాసిరెడ్డి కృష్ణారావు, చావా కృష్ణారావు, పాపినేని రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం నేడు

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ ఎంపీ కేశినేని నాని సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక బి కన్వెన్షన్ హాల్ లో వైఎస్సార్ సీపీ శ్రేణులతో పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. 4 గంటలకు జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ట్యాంకర్ల పంపిణీ, 4.30గంటలకు ఆర్టీసీ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం, 5గంటలకు జగ్గయ్యపేట–చిల్లకల్లు నాలుగులేన్ల రోడ్డులో రూ.కోటితో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎంపీ నాని, ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభిస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : మండలకేంద్రం వత్సవాయిలో రూ.13కోట్లతో పూర్తిచేసిన రైతుభరోసా కేంద్రం, సచివాలయం, మల్టీపర్పస్ గొడౌన్, డైనేజీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుత్తా శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను హాజరై ఆయా అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని వివరించారు. అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా అన్నసమారాధన

పెనమలూరు: పెనమలూరులో ఆదివారం అయ్యప్పస్వామి అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ అన్నసమారాధనలో ప్రత్యేక పూజలు చేశారు. కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని నమ్మేస్థితిలో ప్రజలు లేరు

ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామానికి చెందిన యువకులు తెలుగుదేశంపార్టీని వీడి ఎమ్మెల్సీ అరుణకుమార్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సొంగా రాజేష్, బురదగుంటి విజయ కృష్ణ, దోమా గోపి, నాగేంద్రబాబు, ప్రేమ్ కుమార్, కోటేష్‌లతోపాటు పార్టీలో చేరిన పలువురు యువకులకు అరుణకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తమకు మంచి జరిగిందని, భవిష్యత్తులో కూడా మంచి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని వివరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే ప్రజలు ఉన్నారనే విషయం రానున్న ఎన్నికల్లో మరోసారి రుజువు అవుతుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 2019కు మించిన భారీ విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నందిగామ నియోజకవర్గంలో సైతం పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో రెండోసారి కూడా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విజయం సాధిస్తున్నారని వివరించారు. పార్టీలో చేరినవారు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

15లోగా టిడ్కో గృహాల పంపిణీ

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో నిర్మించిన టిడ్కో గృహాలకు అన్నిరకాల మౌలికవసతులు కల్పిస్తున్నామని, ఫిబ్రవరి 15వ తేదీలోగా లబ్ధిదారులకు 21బ్లాకుల టిడ్కో గృహాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక బలుసుపాడు రోడ్‌లో టిడ్కో ఇళ్ల వద్ద రూ.13కోట్లతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ టిడ్కో గృహాలకు ప్రస్తుతం విద్యుద్దీకరణ, పెయింటింగ్, టెయిల్స్ నిర్మాణ పనులు, పంబ్లింగ్‌తోపాటు రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. గత పాలకులు టిడ్కో ఇళ్ల కోసం భూములు ఇచ్చిన వారికి రూ.3.50కోట్లు, గృహాలను నిర్మించిన ఎల్‌అండ్‌టీ సంస్థకు రూ.45కోట్లు చెల్లించకపోవడంతో భూముల యజమానులు కోర్టును ఆశ్రయించారన్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ పనులు నిలిపివేయడంతో భూముల యజమానులు, ఎల్‌అండ్‌టీ సంస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.48.50కోట్లు చెల్లించి టిడ్కో ఇళ్ల పనులను పూర్తిచేస్తోందని గుర్తుచేశారు. అన్నిరకాల మౌలికవసతులను కల్పించి మొదటి విడతగా ఫిబ్రవరి 15వతేదీలోపు 21 బ్లాకులు(1050) గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని వివరించారు. మిగిలిన టీడ్కో గృహాలకు కూడా త్వరితగతిన మౌలికవసతులు కల్పించి, రెండోవిడతలో త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఈ శ్రీనివాస్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ నాయకులు కాశి కిషోర్, బద్దూనాయక్, పింగళి నరసింహరెడ్డి, కఠారి హరిబాబు, విద్యుత్ శాఖ ఈఈలు శ్రీనివాసరావు, ఎం.వసంతరావు, ఏడీలు శ్రీనివాసరావు, ప్రభు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ సామినేని ఉదయభాను

● అంబేడ్కర్ స్మృతివనానికి సందర్శకుల తాకిడి

విజయవాడలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మృతివనానికి సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చారు. స్మృతివనంలోని అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, ఫౌంటెన్లు, వివిధ ఆకృతులను ఆసక్తిగా తిలకించారు. ఆయా దృశ్యాలను సందర్శకులు వీక్షించి, ఫోన్లలో బంధించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









■ **ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్ష**

విజయవాడరూరల్: నున్న వికాస్ కాలేజీలో ఆదివారం సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతి ఎంట్రన్స్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు, 9వతరగతి ఎంట్రన్స్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించారు. పరీక్షలకు 1,234 మంది హాజరయ్యారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.